## క్లుప్తంగా

### రేపు బాబా మందిర వార్షికోత్సవం

రాజానగరం: స్థానిక షిరిడీ సాయిబాబా మందిర 23వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వేద పండితుడు దీక్షితులు రామకృష్ణ ఆధ్వర్యంలో ఉదయం 8.30 గంటలకు అఖండ బిల్వార్చన ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు విచ్చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

### వేంకటేశ్వరస్వామి ఆలయానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న చిన్నారావు, రేణుకాదేవి దంపతులు

బిక్కవోలు: పందలపాకలోని వెలంపేటలో కొలువైన అలివేలు మంగ, పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయ పునర్నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. అర్చకుడు గరిమెళ్ల విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో రాజమహేంద్రవరానికి చెందిన రెడ్డి వెంకట చిన్నారావు, రేణుకా దేవి దంపతులు కర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ దాతల సహకారంతో ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బొడ్డు లోవరాజు, కర్రి శ్రీనివాసరావు, మల్లిరెడ్డి దుర్గాప్రసాద్, రొంగల ప్రసాద్, కర్రి సతీష్ పాల్గొన్నారు.

### 219 మందికి వైద్య సేవలు



కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్

సీతానగరం: స్థానిక కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో సోమవారం రామకృష్ణ మఠం, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రుల ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహించారు. డాక్టర్ సత్యం రమేష్ బాబు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్ వైద్యసేవలు అందించారు. సాధారణ శిబిరంలో 157 మంది రోగులకు రక్తం, నీరుడు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కంటి శిబిరంలో 62 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 9 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారికి ఉచితంగా ఆపరేషన్ చేసేందుకు ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, యన్నమని వెంకట నారాయణ, చంటిబాబు, కర్లపూడి శేఖర్, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

రాజానగరం: పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చాయనే మనస్తాపంతో ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళితే.. ఇక్కడకు సమీపంలో ఒక ఇంజినీరింగ్ కళాశాలలో నెల్లూరు జిల్లా నర్సాపురం మండలం గుడ్లూరుకు చెందిన పరుచూరి ప్రగతి (19) బీటెక్ ఫస్టియర్ చదువుతోంది. కాలేజీ హాస్టల్‌లోనే ఉంటోంది. మొదటి సెమిస్టర్ పరీక్షలలో నాలుగు పరీక్షలలో ఫెయిలవడం ఆమెను మానసిక వేదనకు గురిచేసింది. వేసవి సెలవులకు ఇంటివెళ్లిన ఆమె సోమవారం నుంచి సెకండ్ సెమిస్టర్ పరీక్షలు కావడంతో ఆదివారమే తిరిగి వచ్చింది. అయితే రూమ్ మేట్స్ (వారంతా సెకండియర్ విద్యార్థినులు) మాత్రం ఇంకా తిరిగి రాకపోవడంతో ఒక్కతే హాస్టల్ ఉంది. ఫస్ట్ సెమిస్టర్ పూర్తి చేయకుండా సెకండ్ సెమిస్టర్ పరీక్షలకు వెళ్లడంతో మానసిక ఆందోళనకు గురైంది. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులకు జాగ్రత్తలు చెపుతూ లేఖ రాసి, తాను ఉంటున్న హాస్టల్ గదిలోనే చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనపర్చుకున్నారు. ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించామని, కేసు దర్యాప్తులో ఉందని స్థానిక సీఐ వీరయ్యగౌడ్ తెలిపారు.

### యోగాసనాలతో రుగ్మతలు దూరం

సీటీఆర్ఐ: ప్రతి రోజూ యోగాసనాలు వేయడం వల్ల శారీరక, మానసిక రుగ్మతలు దూరమవుతాయని జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి అన్నారు. ఆర్ట్స్ కళాశాల సమీపంలో గ్రాండ్ ట్రంక్ రహదారిపై రవాణా శాఖ ఆధ్వర్యంలో సోమవారం 8వ రోజు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ప్రజల్లో యోగా సాధనపై స్వీయ ఆసక్తి కలిగించేలా కలెక్టర్ పి.ప్రశాంతి మార్గదర్శకత్వంలో చక్కటి ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ మాట్లాడుతూ రవాణా రంగంలో ఉన్న లారీ, బస్సు డ్రైవర్, ఆటో డ్రైవర్లు, డ్రైవింగ్ స్కూల్ విద్యార్థులు, ఆటో మొబైల్ అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర అనుబంధ రంగాలకు చెందిన సుమారు 1200 మందికిపై ఈ కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు.

# ఎదురుచూపులేనా..



పందలపాకలో పొలాన్ని దమ్ము చేస్తున్న రైతు



కొంకుదురు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు (ఫైల్)

- ప్రజలను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- పెట్టుబడి సాయం కోసం రైతుల నిరీక్షణ
- తల్లికి వందనం ఎప్పుడు వస్తుందో తెలియదు
- త్వరలో ప్రారంభం కానున్న పాఠశాలలు
- విద్యార్థుల తల్లిదండ్రులపై ఫీజుల భారం

బిక్కవోలు: సాధారణంగా జూన్ నెల వచ్చిందంటే మధ్యతరగతి కుటుంబాలు, రైతుల్లో ఆందోళన నెలకొంటుంది. పాఠశాలలు, కళాశాలల పునఃప్రారంభంతో విద్యార్థుల ఫీజుల కోసం తల్లిదండ్రులు ఆందోళన చెందుతారు. ఇక ఖరీఫ్ ప్రారంభం కావడంతో సాగు పెట్టుబడుల భారం రైతులపై పడింది. పిల్లల ఫీజులు, వసతి ఖర్చులను తలుచుకుని తల్లిదండ్రులు కంగారు పడుతున్నారు. పాఠశాలల ప్రారంభానికి ముసుపే ప్రైవేటు పాఠశాల సిబ్బంది ఇంటింటికీ తిరిగి విద్యార్థులను గాలించారు. ప్రాథమిక పాఠశాల విద్య పూర్తయిన వారిని ఉన్నత పాఠశాలకు, ఉన్నత విద్య పూర్తయిన వారిని తమ కళాశాలలో చేర్పించాలంటూ ఒకటికి రెండు సార్లు ఒత్తిడి తెచ్చి ఆయా పాఠశాలలు, కళాశాలల్లో చేర్పించుకున్నారు.

**నియోజకవర్గంలో..**

నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, జి.మామిడాడల్లో పలు ప్రైవేటు కళాశాలు ఉన్నాయి. వీటితో పాటు రాజమహేంద్రవరం, కాకినాడ, రాయవరం, రామచంద్రపురం, మండపేట తదితర ప్రాంతాల్లోని కళాశాలల నుంచి పదుల సంఖ్యలో బస్సులు చుట్టుపక్కల గ్రామాలకు తిరుగుతున్నాయి. అలాగే ప్రస్తుతం రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. పెట్టుబడుల కోసం ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వ్యవసాయానికి పెట్టుబడి సాయం కింద ఏటా రూ.13,500 అందించి రైతులను ఆదుకునేది. అమ్మఒడి పథకం ద్వారా రూ.15 వేలు అందించి పిల్లల ఫీజుల భారాన్ని తల్లిదండ్రులకు తగ్గించేంది. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత రైతులకు వ్యవసాయానికి పెట్టుబడి సాయం కానీ, చదువుకునే విద్యార్థుల తల్లిదండ్రులకు తల్లికి వందనం పథకం ద్వారా ఆర్థిక సాయం అందజేయలేదు. దీంతో రైతులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

**ఫీజుల మోత**

ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఫీజులు విద్యార్థుల తల్లిదండ్రులకు ఆందోళన కలిగిస్తున్నాయి. ఫీజులు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, బ్యాగుల కొనుగోలుకు వారి నెలవారీ బడ్జెట్ సరిపోవడం లేదు. ప్రాథమిక పాఠశాల స్థాయిలో రూ.15 వేల నుంచి రూ.40 వేల వరకు, ఉన్నత పాఠశాల స్థాయిలో రూ.25 వేల నుంచి రూ.60 వేల వరకు ఫీజులు చెల్లించాల్సి వస్తోంది. ఇంటర్మీడియట్ కోసం కార్పొరేట్ కళాశాలల్లో రూ.60 వేల నుంచి రూ.2 లక్షల వరకూ వసూలు చేస్తున్నాయి.

**సాగు భారం**

నియోజవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల్లో సుమారు 50 వేల ఎకరాల్లో వ్యవసాయం జరుగుతుంది. ఇవికాక పండ్లు, ఆకుకూరలు, కూరగాయాల సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ పనులు ప్రారంభమవుతున్నాయి. ఈ సమయంలో పెట్టుబడి కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సుమారు 33 వేల మందికి రైతు భరోసా ఇచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ పేరుతో రూ. 20 వేలు ఇస్తామన్నారు. అయితే ఏడాది పూర్తి అయినప్పటికీ ఒక్క పైసా ఇవ్వలేదు.

**ఆర్థిక భారం**



జూన్ నెల వచ్చిందంటే మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థిక భారం తప్పదు. మరికొద్ది రోజుల్లో పాఠశాలలను ప్రారంభించనున్న తరుణంలో పిల్లలకు పుస్తకాలు, యూనిఫాం కొనుగోలు చేయాలి. మిగిలిన నెలలతో పోలిస్తే జూన్‌లో ఖర్చులు అధికంగా ఉంటాయి. ఇటు చదువులకు, అటు వ్యవసాయానికి పెట్టుబడులు పెట్టాలి.

– పడాల దుర్గారెడ్డి, పందలపాక

# మధ్యాహ్న భోజన పథకం సిబ్బందికి శిక్షణ



శిక్షణకు హాజరైన మధ్యాహ్న భోజన పథకం సిబ్బంది

అనపర్తి: స్థానిక బాలుర హైస్కూల్లో సోమవారం మధ్యాహ్న భోజన పథకం కుక్ కం హెల్పర్లకు శిక్షణ నిర్వహించారు. దీనికి మండలంలోని 42 పాఠశాలల చెందిన 92 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా కోర్సు డైరెక్టర్ ఎంఈవో ఎస్.సత్తిరెడ్డి మాట్లాడుతూ పాఠశాల పునఃప్రారంభానికి ఒక్క రోజు ముందే సిబ్బంది వెళ్లి, అక్కడి సామగ్రిని శుభ్రం చేసుకోవాలన్నారు. వాటర్ ట్యాంక్‌ను క్లీన్ చేయించి ఆరబెట్టి స్వచ్ఛమైన నీటిని నింపాలన్నారు. జిల్లా ఎండీఎం కో ఆర్డినేటర్ డి.రామకృష్ణ మాట్లాడుతూ ఎండీఎం బిల్లులు సకాలంలో పంపించడంలో అనపర్తి మండలం మొదటి స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో ఎండీఎం స్టేట్ రిసోర్స్ పర్సన్ కృష్ణవేణి, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ సురేంద్ర కుమారి, పాఠశాల హెచ్ఎం వెంకటరెడ్డి, మండల విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి

- సూపర్ సిక్స్ ఊసే ఎత్తని వైనం
- 4న వెన్నుపోటు దినం
- మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి



పందలపాకలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



సీతానగరంలో వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



కోరుకొండలో పోస్టర్‌ను విడుదల చేస్తున్న పార్టీ నాయకులు

బిక్కవోలు: ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి, అధికారం చేపట్టాక వాటిని విస్మరించిన కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు ఈ నెల 4న వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నట్టు మాజీ ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆయన సోమవారం పందలపాకలో వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతేడాది జూన్ 4న ఎన్నికల ఫలితాలు వచ్చాయన్నారు. అప్పుడు అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తయినా సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేదన్నారు. కేవలం వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతోందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులపై భౌతిక దాడులను దిగుతున్నారన్నారు. తనపై కూడా పెదపూడిలో హత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు చూస్తే గత జూన్ 4నే ఈ రాష్ట్రంలో సైతాన్లు పాలనలోకి వచ్చినట్లు అయ్యిందన్నారు. కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ వెన్నుపోటు దినం పేరుతో నిరసనలు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతాయన్నారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు అనపర్తి పార్టీ కార్యాలయంలో ప్రారంభమై స్థానిక మండల కార్యాలయాల్లో అధికారులకు వినతి పత్రం ఇవ్వడంతో ముగిస్తుందన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్ రెడ్డి, మండల కన్వీనర్ పోతుల ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర బూత్ కమిటీ విభాగం కార్యదర్శి బొడ్డు ముత్యాలరావు, మాజీ జెడ్పీటీసీ కిలపర్తి సత్యనారాయణ, కొంకుదురు సొసైటీ మాజీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, రంగాపురం సర్పంచి గండికోట వీరభద్రరావు, కర్రి సతీష్, పాలచర్ల అబ్బు, పడాల సుబ్బారెడ్డి, గండివాసు, పడాల రామారెడ్డి, తమలంపూడి దుర్గారెడ్డి, బండారు గణేష్, ఆదిరెడ్డి అన్నావరం, యాసలపు శ్రీను, బొడ్డు ఆనంద్, పడాల కృష్ణారెడ్డి, నందికేశ్వరరావు, మాడెం వీరాజు, నల్లమిల్లి సుబ్బారెడ్డి, కేశవ, కర్రి ఇజ్రాయెల్ రెడ్డి, బొడ్డు శ్రీను, మచ్చరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

**విజయవంతం చేయాలి**

సీతానగరం: కోరుకొండలో బుధవారం జరగబోయే వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేద్దామని వైఎస్సార్ సీపీ మండల శ్రేణులు పిలుపునిచ్చాయి. ఈ మేరకు సోమవారం సీతానగరంలో సోమవారం పార్టీ మండల కన్వీనర్ గంటా శ్రీనివాస్ నివాసం ప్రాంగణంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీని అమలు చేయని చంద్రబాబు వెన్నుపోటును ప్రజలకు తెలియపర్చడానికే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మండల కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అటకెక్కించారని ఆరోపించారు. సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వలవల వెంకట్రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా మోసం చేయడంలో చంద్రబాబుకి మించిన వారు లేరన్నారు. ఎంపీపీ గుద్రాల జ్యోత్స్న మాట్లాడుతూ ప్రభుత్వ అరాచకాలు, మోసాలు, అన్యాయాలపై వెన్నుపోటు దినం పేరుతో నిరసన కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. మండల సర్పంచ్‌ల సమాఖ్య సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, మాజీ ఎంపీపీ పెందుర్తి దేవదాసు, కవల కృష్ణమూర్తి, ద్వారంపూడి రామకృష్ణ, మట్ట కాపు, ఈత వీరబాబు, వలవల సత్తిబాబు, మట్ట శ్రీను తదితరుల పాల్గొన్నారు.

**నాడు సంక్షేమం – నేడు విధ్వంసం**

కోరుకొండ: నాడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తే, నేడు కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తూ, హామీలను అమలు జరపకుండా ప్రజలను వేధిస్తోందని వైఎస్సార్ సీపీ కోరుకొండ మండల అధ్యక్షుడు అడపా కనకరాజు అన్నారు. కోరుకొండ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. గుమ్ములూరు సర్పంచ్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నక్కా రాంబాబు మాట్లాడుతూ సొంత మామ, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీ రామారావుకు వెన్నుపోటు పొడిచి, అధికారాన్ని హస్తగతం చేసుకున్న చంద్రబాబునాయుడు, 2025 ఎన్నికల్లో అధికారాన్ని పొందాక ప్రజల కిచ్చిన హామీలను అమలు జరపకుండా వెన్నుపోటు పొడిచారన్నారు. పార్టీ శ్రేణులంతా ప్రజల పక్షాన నిలబడి హామీల అమలు కోసం ఉద్యమించాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, నాయకులు కొండపల్లి దుర్గారావు, తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి, గణేశుల పోసి, బొరుసు బద్రి, పసుపులేటి బుల్లియ్య నాయుడు పాల్గొన్నారు.

# అభ్యసనా సామర్థ్యాల పెంపు కోసమే శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సుభాషిణి

రాజానగరం: విద్యాబోధనలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి అన్నారు. అందుకోసమే ఉపాధ్యాయులకు ఈ శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. తూర్పుగానుగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మండల రిసోర్స్ పర్సన్లకు 'టీచ్ ఎట్ ద రైట్ లెవెల్ (తరల్), ఎస్‌సీఈఆర్‌టీ' అంశాలపై మూడు రోజులు ఇచ్చే శిక్షణను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరంలో పాఠశాలల్లో అమలవుతున్న అభ్యసన ప్రక్రియలు, ఎస్‌సీఈఆర్‌టీ అంశాలపై ప్రత్యేక మానిటరింగ్ ఉంటుందన్నారు. రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన స్టేట్ రిసోర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో ఈ తరగతులు జరుగుతున్నాయన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన మండల రిసోర్స్‌పర్సన్లు అనంతరం తమ మండలాలకు వెళ్లి అక్కడ ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు అమ్మి నాయుడు, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి డి.గౌరీశంకరరావు, తరల్ జిల్లా కో ఆర్డినేటర్ సురేష్ నాని, 13 మంది స్టేట్, 110 మంది మండల రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.


# క్షయపై ప్రతి ఒక్కరూ ఉద్యమించాలి



దొడ్డిగుంటలో క్షయపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చిన్నారావు

రంగంపేట: క్షయవ్యాధిపై ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని అనపర్తి టీబీ యూనిట్ డాక్టర్ కె.చిన్నారావు అన్నారు. మండలంలోని ముకుందవరం, దొడ్డిగుంట గ్రామాల్లో సోమవారం ఆయన తన బృందంతో కలిసి పర్యటించారు. ఇంటెన్సిఫైడ్ టీబీ కేంపెయిన్‌లో భాగంగా క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సమాజం ఆరోగ్యంగా ఉంటేనే దేశం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. గాలి తుంపర్ల ద్వారా ఇతరులకు వేగంగా సోకే వ్యాధి క్షయ అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.మహేష్ బాబు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా నాని



సీతానగరం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా చినకొండేపూడికి చెందిన చేకూరి వీఎస్ రామకృష్ణంరాజు (నాని) ఎంపిక య్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఆయన గతంలో మండల సచివాలయం కన్వీనర్‌గా సేవలు అందించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, అమలాపురం పార్లమెంటరీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, ఉభయ గోదావరి జిల్లాల పార్టీ యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాగా.. నాని ఎంపికపై ఎంపీపీ గుద్రాల జ్యోత్స్న, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, మండల సర్పంచ్ సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు హర్షం వ్యక్తం చేశారు.

# దోమల నివారణకు మందు పిచికారీ



కాండ్రేగులలో దోమల మందు పిచికారీని పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో గ్రామాల్లో సచివాలయ అధికారులు దోమల నివారణకు వివిధ రకాల మందుల మిశ్రమాన్ని పిచికారీ చేయించాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. కాండ్రేగుల గ్రామంలో సోమవారం దోమల నివారణ మందును కార్మికులు పిచికారీ చేశారు. ఆ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలతో దోమలు విపరీతంగా పెరిగాయన్నారు. నువాన్, మలాథియాన్, ఏబేట్, బేటాక్స్, ఫినాయిల్, డీజిల్, ఫెనోటా తదితర రకాలను మిశ్రమంగా కలిపి మురుగు కాలువలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాలు, మరుగుదొడ్లు ఉన్నచోట పిచికారీ చేయించారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుడిపూడి వీర వెంకట సత్యనారాయణ, సచివాలయం కార్యదర్శి వై.స్వరూప్ రెడ్డి, గ్రామ నాయకులు పి.శివరామకృష్ణ, పి.వీర వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఆరు అర్జీలు



అర్జీని స్వీకరిస్తున్న ఎంపీడీవో భారతి

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆరు అర్జీలను ఎంపీడీవో ఎం.భారతి, తహసీల్దార్ ఎ. శ్రీనివాస్ అందుకున్నారు. సీతానగరానికి చెందిన చుండ్రు పద్మ ప్రభాకర్ తన ఏరియాలో విద్యుత్ లోఓల్టేజీ సమస్య ఉందని, రాపాకకు చెందిన అంబటి మంగమ్మ పొలంలో విద్యుత్ స్తంభాలు ఒరిగి వైర్లు కిందకు వేలాడుతున్నాయని, నాగంపల్లికి చెందిన కె.మృదుల సర్వే నంబర్‌లో 2.70 ఎకరాలకు భూమి తగ్గి ఉందని, రీసర్వే చేసి తన భూమి అప్పగించాలని, రాపాకకు చెందిన మద్దిపాటి శ్రీదేవి పంట భూమికి సంబంధించి ఆన్‌లైన్‌లో తన పేరు నమోదు చేయాలని అర్జీలు అందించారు. రఘుదేవపురానికి చెందిన మరిని నాగేంద్ర ప్రసాద్ తన భూమి తక్కువ ఉందని, రీసర్వే చేయాలని, ఇనుగంటివారి పేటకు చెందిన ఆరాధ్యుల వెంకటరామ నాగసాయికుమార్ తహసీల్దార్ ద్వారా ఎన్‌ఓసీ సర్టిఫికెట్ ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కేవీఎస్ఎస్ మూర్తి, ఏవో సుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్ గోపాల్, కంప్యూటర్ ఆపరేటర్ సతీష్ పాల్గొన్నారు.

# దళితుల దారిని పునరుద్ధరించాలి




కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఏపీఆర్‌సీఎస్ సభ్యులు

సీటీఆర్ఐ: దళితుల దారిని పునరుద్ధరించాలని, దాన్ని మూసివేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ ప్రకారం కేసు నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం (ఏపీఆర్‌సీఎస్) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రాజబాబు మాట్లాడుతూ రంగంపేట మండలం ఈలకొలను రెవెన్యూ గ్రామ పరిధిలోని అచ్యుతాపురం చివర గల కొత్తపేట కాలనీలో సుమారు 100 కుటుంబాలు దళితులు, ఇతర పేదలు జీవిస్తున్నారన్నారు. వీరు ఎన్నో ఏళ్లుగా రాకపోకలు సాగిస్తున్న కొత్తపేట నుంచి బొట్టు గొయ్యి పుంతకు చేర్చే దారి మార్గాన్ని సరిహద్దు రైతు అక్రమ మార్గంలో కంచి వేసి మూసివేశారన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని అనేకసార్లు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఆ కాలనీ వాసులు ఎవరైనా చనిపోతే ఊరిలోంచి తీసుకెళ్లనివ్వరని, ఏదైనా ప్రమాదాలు జరిగితే అంబులెన్స్, ఫైరింజిన్ రావడానికి సరైన మార్గం లేదన్నారు. దీంతో కాలనీ వాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్టీయూ ఉమ్మడి అధ్యక్షుడు కుంచె అంజిబాబు, పీడీఎస్‌యూ విజృంభణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడితి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### బాల్య వివాహాలను నిరోధించాలి

కడియం: బాల్య వివాహాల నిరోధానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంపీపీ వెలుగుబంటి సత్య ప్రసాద్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఈ మేరకు అవగాహన సమావేశం నిర్వహించారు. చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళల అభివృద్ధి, శిశు, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో రమేష్, ఐసీడీఎస్ ఏసీడీపీవో టి.కనకవల్లి, బాలల పరిరక్షణ విభాగం అధికారి క్రాంతి లాల్, క్రాఫ్ జిల్లా కో ఆర్డినేటర్ బిరాజ్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఐసీడీఎస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఖరీఫ్ పనుల పరిశీలన



దోమాడలో నారుమడికి సిద్ధం చేస్తున్న పొలాన్ని పరిశీలిస్తున్న మణిదీప్

పెదపూడి: రైతులు ముందస్తు సాగుకు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి మండల వ్యవసాయశాఖ అధికారి టీవీఆర్ మణిదీప్ అన్నారు. ఆయన సోమవారం దోమాడ, గండ్రేడు, పెదపూడి గ్రామాల్లో పర్యటించారు. బోర్ల వద్ద ముందుగా వేసుకున్న నారుమడులు, వాటి కోసం సిద్ధం చేస్తున్న పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్‌కు నీటిని విడుదల చేశారని, రైతులు దమ్ములు చేపట్టి, విత్తనాలు పోసుకోవాలన్నారు.

సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమైన రైతులు వెంటనే వ్యవసాయశాఖాధికారులు, కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఆయన వెంట ఏఈఓ సత్యనారాయణ, సిబ్బంది, రైతులు ఉన్నారు.